## విలేకరులు కావలెను

ప్రతిజ్ఞ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
వేణు
7032356032



# ప్రతిజ్ఞ

తెలుగు దిన పత్రిక

ప్రజాహితం - మా అభిమతం





PUBLISHED FROM : హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి | ఎడిటర్ : మోదుగు వేణు | సోమవారం 13 ఏప్రిల్ 2026


## ఢిల్లీ చేరుకున్న లోకేశ్

**-నేడు కూటమి ఎంపీలతో కలిసి రాష్ట్రపతితో భేటీ**

**-రాజధాని బిల్లు ఆమోదంపై ధన్యవాదాలు**



న్యూఢిల్లీ, ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సోమవారం భేటీ కానున్నారు. ఆయన ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రమంలో ఆయనకు టీడీపీ ఎంపీలు సాదర స్వాగతం పలికారు. లోకేశ్ వారందరినీ ఆప్యాయంగా పలకరించి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై క్లుప్తంగా చర్చించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంపై సోమవారం కూటమి ఎంపీలతో రాష్ట్రపతిభవన్‌కు వెళ్లి ఆమెకు కృతజ్ఞతలు తెలుపనున్నారు.

## నా భోజనం తిని.. నాకే ద్రోహం చేస్తావా?'

**-సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిస్వాధీనం,**

**- గెస్ట్‌హౌజ్, అపార్ట్‌మెంట్ కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత**

అమీన్‌పూర్, ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమి స్వాధీనం, గెస్ట్‌హౌజ్, అపార్ట్‌మెంట్ కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత, న్యాయవాది ఎంఏ ముఖీం స్పందించారు. తన తండ్రి ఎంఏ షర?ఫతో కలిసి మాట్లాడిన ముఖీం.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద స్థలంలో ఎంఏ ముఖీం చేపట్టిన నిర్మాణాలను హైడ్రా శనివారం తొలగించిన సంగతి తెలిసిందే. అయితే, గతంలో మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసిన సమయంలో పాత పరిచయంతో తన ఇంటికి వచ్చి కాళ్లు పట్టుకుని గెలిపించాలని ప్రాధేయపడిన విషయం నిజం కాదా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఎంఏ ముఖీం ప్రశ్నించారు. కేవలం కక్షపూరితంగా తనను వేధిస్తున్నారని ఆరోపించారు. 'నా ఇంట్లో భోజనం చేసి, నీళ్లు తాగి నాకే ద్రోహం చేస్తావా' అని సీఎంపై ధ్వజమెత్తారు. తాతముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడం ఎంతవరకు సమంజసమని



ప్రశ్నించారు. ఏకపక్షంగా ప్రభుత్వ భూమి అని తేల్చి చర్యలకు దిగడం సరికాదని అన్నారు. ప్రభుత్వం, హైడ్రా ఎన్ని కుట్రలు చేసినా న్యాయస్థానంపై నమ్మకంతో ముందుకు వెళతామని ముఖీం పేర్కొన్నారు.

## ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం: పవన్ కల్యాణ్

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

ప్రముఖ గాయని, లెజెండరీ సింగర్ శ్రీమతి ఆశా భోంస్లే మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సినిమాలో ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ సహా అనేక భాషలలో కొన్ని దశాబ్దాల పాటు ఆశా భోంస్లే గారు లెక్కలేనన్ని చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. శాస్త్రీయ, పాశ్చాత్య, సమకాలీన సంగీత శైలులలో ఆమె చూపిన అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ అన్ని తరాల సంగీత ప్రియుల మన్ననలను పొందింది" అని కొనియాడారు. "దమ్ మారో దమ్", "చురాలియా హై తుమ్నే", "ఇన్ ఆంఖోం కీ మస్తీ", "రాధా కైసే నా జలే" వంటి ఆమె పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని



పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలుగు సినిమాలలో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ సంగీతం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఎంతో ఆదరణ పొందారని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ అవుతోందా?

## ఆసక్తి రేపుతున్న కేటీఆర్ వ్యాఖ్యలు

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

బీఆర్ఎస్ పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి)గా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోబోమని, ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో జరిగిన ఓ కార్యక్రమం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కొన్ని పొరపాట్లు చేసిందని కేటీఆర్ అంగీకరించారు. ఈ తప్పుల కారణంగా ప్రజలకు, పార్టీ నాయకులకు మధ్య కొంత దూరం పెరిగిందని, దీనిపై తాము పూర్తిస్థాయిలో అధ్యయనం చేశామని తెలిపారు. గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు."చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్మినంత మాత్రాన చంద్రుడు కనుమరుగు కాడు. ఆ మబ్బులు తొలగి మళ్లీ ప్రకాశిస్తాడు. బీఆర్ఎస్ కూడా తాత్కాలికంగా వెనుకబడ్డా తిరిగి పుంజుకుని అధికారంలోకి



వస్తుంది. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని, మేధావులు మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు, కేసీఆర్ గొప్ప ముఖ్యమంత్రులుగా నిలిచారని ప్రస్తావించారు. ప్రస్తుతం కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీ పేరు మార్పు ఆలోచన, భవిష్యత్ వ్యూహాలపై విశ్లేషణలు మొదలయ్యాయి.

## రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో-దాచుకో' పథకం నడిపిస్తోంది: కేటీఆర్ తీవ్ర విమర్శలు

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకో-దాచుకో' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. "సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి 'ఆర్‌ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కానీ, ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు? దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు చీకటి దోస్తులని, ఒకరి అవినీతిని మరొకరు కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది," అని కేటీఆర్ విమర్శించారు. సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నారని, 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' అనే కొత్త విధానంతో కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన



వారసత్వ ఉద్యోగాలపై విచారణ జరిపిస్తామని బెదిరించడం కాదని, సృజన్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, అవినీతిని ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపైనా అగ్గిపుట్టిస్తామని హెచ్చరించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, మంత్రి వివేక్ ఓటమిని తట్టుకోలేక కౌన్సిలర్లను వేధించారని కేటీఆర్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని, పోలీసులతో భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగని తమ పార్టీ కౌన్సిలర్లను అభినందించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో తెలంగాణపై భస్మాసుర హస్తం పెట్టిందని కేటీఆర్ అన్నారు. సింగరేణి కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, రానున్న యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహిళా రిజర్వేషన్ల అమలులో భాగస్వాములు కండి

న్యూఢిల్లీ, ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

మహిళా రిజర్వేషన్ల అమలు కోసం చట్ట సవరణను ఆమోదించే చరిత్రాత్మక ఘట్టంలో.. అందరూ ఏకతాటిపైకి వచ్చి భాగస్వాములు కావాలని పార్లమెంటు ఉభయసభల్లోని అన్ని రాజకీయ పక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించిన అంశం కాదని, ఇది మన మహిళా లోకం పట్ల, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను చాటుకునే సమయమని అన్నారు. నారీ శక్తిని, 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నిజం చేస్తూ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణను ఏకతాటిపైకి వచ్చి ఆమోదిస్తారని తాను నమ్ముతున్నానని మోదీ పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ చట్టం) అమలుపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఉభయసభలలోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకూ లేఖ రాశారు. ఈ ప్రత్యేక సమావేశాలు భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని తన లేఖలో ఆకాంక్షించారు. "అభివృద్ధి చెందిన భారత్‌ను ఆవిష్కరించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకం. అంతరిక్షం నుంచి క్రీడల వరకూ, సాయుధ దళాల నుంచి స్టార్టప్‌ల వరకూ ప్రతి రంగంలో దేశ ఆడబిడ్డలు తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు రాజకీయాల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగాల్సిన సమయం వచ్చింది. 2029 లోక్‌సభ, శాసనసభల అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహించడం చాలా ముఖ్యం. ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థలో కొత్త శక్తిని నింపుతుంది. పాలనలో మహిళల ప్రాతినిధ్యాన్ని నిర్ధారిస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు. 2023లో పార్లమెంట్‌లో అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా మహిళా రిజర్వేషన్ల చట్టానికి మద్దతు తెలపడం ఒక చిరస్మరణీయ ఘట్టమని గుర్తుచేశారు. మహిళా కోటా అమలుపై గత కొంతకాలంగా రాజ్యాంగ నిపుణులతో, వివిధ రాజకీయ పక్షాలతో సంప్రదింపులు జరపగా.. ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలనే విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తమైందని తెలిపారు. మహిళా రి జర్వేషన్ చట్టాన్ని దాని అసలు స్ఫూర్తితో అమలు చేసే సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు. ఇందుకు సహకరించే పార్లమెంటు సభ్యులు ఈ చరిత్రాత్మక ప్రయత్నంలో భాగమైనందుకు ఎల్లప్పుడూ గర్వపడతారని, ఈ అవకాశాన్ని జారిపోనివ్వకూడదని ప్రధాని సూచించారు.



**ఇన్నాళ్లూ నిద్ర పోయారా?: ఖర్గే**

మహిళా రిజర్వేషన్ల అమలుపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "2023లోనే మహిళా కోటా చట్టం చేసినా 30 నెలల పాటు నిద్రపోయి, ఇప్పుడు ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం హడావుడి చేస్తున్నారా?" అంటూ మోదీకి రాసిన లేఖలో సూటిగా ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల చట్టసవరణతో ముడిపడి ఉన్న డీలిమిటేషన్ అంశంపై చర్చించడానికి.. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే ఏప్రిల్ 29 తర్వాత ఎప్పుడైనా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు పై అందరిలోనూ ఏకాభిప్రాయం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొనడాన్ని ఖర్గే తప్పుబట్టారు. 2023 సెప్టెంబరులో బిల్లు పాసైనప్పుడే.. వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున తాను డిమాండ్ చేశానని, అప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు విపక్షాల్ని సంప్రదించకుండానే ఈ ప్రత్యేక సమావేశాలకు పిలిచారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనపై వివరాలు వెల్లడించకుండానే కేంద్రం తమ సహకారాన్ని కోరుతోందని, పునర్విభజన వివరాలు, ఇతర అంశాలపై స్పష్టత లేకుండా ఈ చట్టంపై పార్లమెంటు సమావేశాలలో అర్థవంతమైన చర్చ అసాధ్యమని ఖర్గే తేల్చిచెప్పారు. రాజకీయ పక్షాలతో సంప్రదింపులు జరిపామని ప్రధాని మోదీ చెప్పడం అసత్యమని విమర్శించారు. కేవలం రాజకీయ మైలేజీ కోసమే మోదీ సర్కారు తొందరపడుతోందని ఆయన ఆరోపించారు. కాగా, మోదీ ప్రభుత్వం జనాభా లెక్కల సేకరణను అటకెక్కించాలని చూస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. దేశాన్ని తప్పుదోవ పట్టించే ఎజెండాతో మహిళా రిజర్వేషన్ బిల్లును సవరించాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని, ఇది భారీ వంచనేనని ఆదివారం 'ఎక్స్'లో ఆయన ధ్వజమెత్తారు.

## అమెరికా దాడిలో మరణించిన 3,375 మంది గుర్తింపు

ఇస్తాంబుల్, ఏప్రిల్ 12:

అమెరికా-ఇజ్రాయెల్‌లు జరిపిన వైమానిక దాడిలో మరణించిన 3,375 మందిని గుర్తించినట్టు ఇరాన్ లీగల్ మెడిసిన్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. వీరిలో 2,875 మంది పురుషులు, 496 మంది మహిళలు ఉన్నట్టు తెలిపింది. మిగిలిన నలుగురి వివరాలను వెల్లడించలేదు. మృతుల్లో అత్యధికులు ఇరాన్ దేశీయులే. చైనా, ఇరాక్, లెబనాన్, అఫ్ఘాన్, పాక్, సిరియా దేశాలకు చెందిన వారు కూడా మరణించారని తెలిపినా, వారి సంఖ్యను మాత్రం ప్రకటించలేదు. శాస్త్రీయ విధానాల ద్వారా మృతులను గుర్తించినట్టు పేర్కొంది.



# దేశాభివృద్ధికి యువతే ప్రధాన శక్తి విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలం ఎర్రబెల్లి స్వర్ణ





**ప్రతిజ్ఞ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 12 ఏప్రిల్ 2026**

హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించిన Inspire IIT Excellence Awards 2026 కార్యక్రమంలో ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మరియు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎర్రబెల్లి స్వర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ...విద్యార్థుల ప్రతిభ, కృషి, పట్టుదల చూసి ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ రోజుల్లో పోటీ వాతావరణంలో ముందుకు సాగాలంటే నిరంతర శ్రమ, క్రమశిక్షణ, మరియు స్పష్టమైన లక్ష్యంతో పనిచేయడం చాలా ముఖ్యమని సూచించారు. దేశాభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని, విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగల సామర్థ్యం యువతలో ఉందని పేర్కొన్నారు. ఇలాంటి Inspire IIT Excellence Awards వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, మరింత మెరుగైన లక్ష్యాలను ఏర్పరుచుకునేలా ప్రేరణనిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పాఠశాల టాపర్లను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బండారి నిహారిక ఓణీల వేడుకలో తెలంగాణ ఉద్యమకారుడు దాసరి శ్రీను



**ప్రతిజ్ఞ ఏప్రిల్ 12**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామ వాస్తవ్యులు బండారి వీరభద్రం, ఇందు లోకుమార్తె నిహారిక ఓణీల వేడుకలో తెలంగాణ ఉద్యమకారులు దాసరి శ్రీను పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను మాట్లాడుతూ నిహారిక భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దాసరి శ్రీను చిన్నారిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ డాక్టర్ బండారి వీరబాబు, నామవరపు నాగేశ్వరరావు డైరెక్టర్ మైన్స్ అండ్ లేబర్ ఎంప్లాయిమెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, జిల్లా శంకర్ ఎలక్ట్రికల్ ఏఈ, అడపాల అశోక్ కానిస్టేబుల్, ఖమ్మం పాత్రికేయులు పాగ యోనా, నామవరపు కోటేశ్వరరావు, గుద్దటి బాబు, వెంకయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు

## మార్కెట్ డైరెక్టర్ కుమారుడిని పరామర్శించిన మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి





**ప్రతిజ్ఞ ఏప్రిల్ 12**

ఎదులాపురం మున్సిపాలిటీ, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ కుమారుడు కర్లపూడి కార్తీకేయను తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7 వ వార్డ్ గుర్రాలపాడు కి చెందిన కర్లపూడి భద్రకాళి తనయుడు కార్తీకేయ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విజయవాడలోని ఓ కాలేజీలో అగ్రికల్చర్ బీఎస్సీ 4వ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ ముగిసిన తరువాత సాయంత్రం హాస్టల్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనం డీకొట్టింది. దీంతో కార్తీకేయ కు గాయాలయ్యాయి. విజయవాడ లోనీ ఓ ప్రైవేట్ ఆస్పత్రి నందు చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రివర్యులు శుక్రవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పూర్తిగా ఆరోగ్యం కొలుకునేంత వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పోకబత్తిని అనిత వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సెలర్ బొర్రా మహేష్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్, నూకల రామ్మోహన్ రెడ్డి,అజ్మీరా అశోక్ నాయక్,కందుకూరు వెంకటనారాయణ,టెలి కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రంజిత్ నాయక్, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎన్ పి చారి, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు బానోత్ కిషోర్, కళ్ళెం శేష్ రెడ్డి,గుర్రం రాకేష్,ఉపేందర్ రెడ్డి, నాగరాజు, భద్ర చారి తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల వేళ ఎందుకీ తొందర మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీకి ఖర్గే ఘాటు లేఖ



**ప్రతిజ్ఞ ఏప్రిల్ 12**

న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆదరాబాదరాగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యగా కనిపిస్తోందన్నారు. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఖర్గే లేఖ రాశారు.నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడించకుండా మళ్లీ తమ సహకారం కోరడం సరికాదని, ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశాలపై అర్థవంతమైన చర్చ జరగాలని ఖర్గే అన్నారు. ఇందుకోసం ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నారీ శక్తి అభియాన్ 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మీకు తెలుసు. ఆ సమయంలో తక్షణం ఈ కీలక చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున నేను స్వయంగా కోరాను' అని ఖర్గే గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన వివరాలు వెల్లడించకుండా విపక్షాల సహకారాన్ని కేంద్రం కోరుతోందని, డీలిమిటేషన్, ఇతర కీలకాంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని పేర్కొన్నారని, అయితే అది నిజం కాదని ఖర్గే అన్నారు. 2026 ఏప్రిల్ 29న ఎన్నికలు ముగుస్తాయని, ఆ తర్వాత ఎప్పుడైనా సరే రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు, అందరినీ ఏకతాటిపై ముందుకు తీసుకు వెళ్లేందుకు ఉద్దేశించినదే అయితే నారీ శక్తి వందన్ అధినియమ్-2023 సవరణతో ముడిపడిన డీలిమిటేషన్‌పై చర్చ జరిపేందుకు ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే సూచించారు.

## మున్సిపల్ సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభం




**ప్రతిజ్ఞ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 12 ఏప్రిల్ 2026**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఫీనిక్స్ ఫౌండేషన్ మరియు శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, ఇటువంటి ఉచిత శిబిరాలు వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. శిబిరంలో సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాయంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రతిజ్ఞ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 12 ఏప్రిల్ 2026**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా శాయంపేటలో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి సైడ్ డ్రైన్లు మరియు అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండేళ్లలో ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలలు, దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ గత ప్రభుత్వాలు అభివృద్ధికి నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోందని, భూకబ్జాలను అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో విద్యార్థి ఆత్మహత్య మెరిట్ మార్కులతో పాస్ ..!



**ప్రతిజ్ఞ ఏప్రిల్ 12**

మధిర నియోజక వర్గం బోనకల్ మండల్ ఇంటర్ ఫలితాల వేళ ఖమ్మంలో తీవ్ర విషాదం నెలకొంది. పరీక్షల్లో ఫెయిల్ అవుతాన్న భయంతో ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బోనకల్ మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గంగదేవుళ్ల అక్షాంత్ ఇటీవల ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాశాడు. కానీ పరీక్షలు సరిగ్గా రాయలేదని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల కింద మధిరలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం ఇంటర్ బోర్డు విడుదల చేసిన ఫలితాలను చెక్ చేయగా అన్ని సబ్జెక్టులు పాస్ కావడం విశేషం. అక్షాంత్‌కు సబ్జెక్టుల వారీగా ఇంగ్లీష్‌లో 67, సంస్కృతంలో 60, మ్యాథ్స్-1లో 40, మ్యాథ్స్-2లో58, ఫిజిక్స్‌లో 49, కెమిస్ట్రీలో 54, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో 19 మార్కులు వచ్చాయి. మొత్తంగా ఫస్టియర్‌లో 470 మార్కులకుగానూ 347 మార్కులు సాధించి బీ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. కానీ ఫలితాలు రాకముందే, ఫెయిల్ అవుతాననే భయంతో అక్షాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు విలపిస్తున్నారు

## ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

**-కానీ ఫలితాల్లో పాసైన అక్షాంత్ అనే విద్యార్థి**

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12



ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాపల్లి గ్రామంలో విషాదం ఘటన గంగదేవుళ్ళ అక్షాంత్ అనే విద్యార్థి మధిరలో రైలు కిందపడి ఆత్మహత్య కొద్దిసేపటి క్రితం విడుదలైన ఫలితాల్లో 347 మార్కులు సాధించి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ పాస్ అయ్యిన మృతుడు అక్షాంత్ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు.

## హైడ్రాకు హైకోర్టు వరుస మొట్టికాయలు

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12



నిషేధిత జాబితాలో ఉన్నంత మాత్రాన కంచె వేస్తామంటే కుదరదని హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో 1.26 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా కంచె వేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ ఈ వ్యవహారంలో హైడ్రా జోక్యం చేసుకోకుండా అడ్డుకోవాలని, అక్కడ ఏర్పాటు చేసిన బోర్డును తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరిన పిటిషనర్ దీనిపై స్పందిస్తూ భూమి నిషేధిత జాబితాలో ఉన్నంత మాత్రాన, ప్రభుత్వ అనుమతి లేకుండా, అది ప్రభుత్వ భూమి అనే ధృవీకరణ లేకుండా కంచె ఎలా వేస్తారని హైడ్రాపై ఆగ్రహం ఈ భూమిపై సంబంధిత కలెక్టర్ నుండి అధికారిక వివరణ తీసుకోవాలని హైడ్రాకు ఆదేశం కంచె వేయడానికి అనుమతించే ముందు ఈ భూమిపై ఏవైనా కేసులున్నాయో లేదో ధృవీకరించుకోవాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు విచారణ ఈనెల 13కు వాయిదా.

## ఎమ్మెల్యే నాయిని ఇంటి ముందు చల్లటి నీరు చలివేంద్రం

ప్రతిజ్ఞ పత్రిక ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మార్చ్ (12)




ప్రతియేడు మాదిరిగానే ఈ వేసవిలో కూడా కిషన్‌పురలోని ఎమ్మెల్యే ఇంటి ముందు చలివేంద్రం ఏర్పాటు చేసి, ప్రజలకు తాగునీటి సౌకర్యం ఈ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నాయిని తండ్రి నాయిని నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోదరులు నాయిని అమరేందర్ రెడ్డి ,ప్రవీణ్ ,కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంటర్ 2026 ఫస్ట్ సెకండ్ ఇయర్ ఫలితాలు




ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

హైదరాబాద్, తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు 2026 రాసిన విద్యార్థులకు గుడ్‌న్యూస్. ఇంటర్ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 12 ఉదయం 11 గంటలకు విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఇంటర్ ఫలితలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ కింది టీవీ9 తెలుగు అధికారిక వెబ్‌సైట్ లింక్‌లో తమ హాల్ టికెట్ నంబర్ నమోదు చేసి రిజల్ట్స్ చెక్ చేసుకోవచ్చు. అలాగే సబ్జెక్టుల వారీగా మార్కుల వివరాలను కూడా ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌తోపాటు ఈ కింది టీవీ9 తెలుగు వెబ్‌సైట్‌లోనూ చెక్ చేసుకోవచ్చు.ఈ రోజు విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో 70.58 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇక తాజా ఫలితాల్లో ఎప్పటి మాదిరిగానే అమ్మాయిలు సత్తా చాటారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో అమ్మాయిలు గరిష్ఠ మార్కులతో అధిక ఉత్తీర్ణత సాధించారు

# గాయని ఆశ బోస్లే కన్నుమూత

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12




లెజెండరీ సింగర్ ఆశా భోస్లే (92) కన్నుమూత,బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించిన ఆశా భోస్లే,లతా మంగేష్కర్ సోదరిగా మ్యూజిక్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఆశా భోస్లే.ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో హిందీ, మరాఠీతో సహా పలు భాషల్లో వేలాది పాటలు పాడిన ఆశా భోస్లే.దాదాసాహెబ్ ఫాల్కే, పద్మవిభూషణ్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న ఆశా భోస్లే.1950 వ దశకంలో బాలీవుడ్ లో తన ప్రస్థానాన్ని మొదలు పెట్టిన ఆశా భోస్లే.1952 లో సంగ్దిల్ చిత్రం తో గుర్తింపు.పరిణితి, బూట్ పాలిష్ చిత్రాలతో అగ్ర దర్శకుల దృష్టి ని ఆకర్షించిన ఆశా.1970 దశకం లో పియా తు అబ్ తో ఆజా , దమ్ మారో దమ్ , చురా లియా హై తుమ్నే పాటలు బాగా పాపులర్ అయ్యాయి. మహమ్మద్ రఫీతో కలిసి ఆమె పాడిన మాంగ్ కే సాథ్ తుమ్హారా,సాథీ హాత్ బఢానా,ఉదేన్ జబ్ జబ్ జుల్ఫెన్ తేరీ,వంటి పాటలు నేటికీ ఎవర్‌గ్రీన్ హిట్స్,ఆర్.డి. బర్మన్ సంగీత దర్శకత్వంలో ఆశా భోస్లే పాడిన పాటలు ఒక ట్రెండ్ సెట్ చేశాయి. ఆజా ఆజా, పియా తూ అబ్ తో ఆజా,యే మేరా దిల్" వంటి డ్యాన్స్ నంబర్లతో అప్పట్లోనే సంచలనం సృష్టించిన ఆశా భోస్లే కమర్షియల్ పాటలకే పరిమితం కాకుండా గజల్స్ పాడి జాతీయ అవార్డులను సైతం అందుకున్న ఆశా భోస్లే,90వ దశకంలో 'రంగీలా' చిత్రంతో కుర్రకారును ఉర్రూతలూగించిన ఆశా భోస్లే సంగీత సామ్రాజ్ఞిగా కీర్తి పొందిన ఆశా భోస్లే

## ఆనాడు తెలంగాణ కోసం పోరాడం ఈనాడు ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడుతున్నాం

**-తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవం ఇవ్వాలి, అందరికీ తగిన న్యాయం చేయాలి.**

**-ఈనెల 18న హైదరాబాద్లో జరిగే సభను విజయవంతం చెయ్యండి**

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12



ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా శ్రీధర్ హోటల్ లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ పాలకుర్తి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీలం పాపారావు లు మాట్లాడుతూ ఉద్యమకారుల హక్కుల సాధనకై రాజకీయ పార్టీలకు కుల సంఘ కుల సంఘాలకు అతీతంగా ఈనెల 18న హైదరాబాద్లో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు తీరని అన్యాయం జరిగిందని ఆనాడు సకలజనులు సమ్మెలో పాల్గొన్న ఉద్యమకారులు ఇంతవరకు ఎటువంటి ఫలాలు నోర్చుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులు ఏ పార్టీలో ఉన్నా ఏ సంఘాలలో ఉన్న అందరూ కలిసికట్టుగా వచ్చి న్యాయపరమైన తమ హక్కులను సాధించుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో అడుగడుగునా ఉద్యమకారులు అనగా దొక్క పడుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రత్యేక ఏర్పాట్లు లో ముఖ్యపాత్ర వహించిన ఉద్యమకారులను విస్మరించడం తగదన్నారు. ఎన్ని ఉద్యమ సంఘాలు పుట్టకొచ్చిన ఉద్యమకారులకు న్యాయం చేయడమే ఏకైక ఏ జెండాగా (ప్రధాన లక్ష్యం) పెట్టుకోవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా మీడియా కన్వీనర్ మంద వెంకటేశ్వర్లు, తెలంగాణ లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కేళోతు రవిచంద్ర చౌహాన్, తోటపల్లి శ్రీను, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, యానాల సాంబశివా రెడ్డి, ఉద్యమ కారుల ఫోరం పాలేరు కన్వీనర్ ఎదుగట్ల చిట్టిమల్లు, పుట్టభత్తిని బాలస్వామి, తెలంగాణ ఉద్యమ సాధన ప్రసంసా పత్ర గ్రహిత తెలగమళ్ళ గోవిందు, తెలంగాణ ఉద్యమకారుల ఫారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతురాజు రమాదేవి, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు జి. మరియాకుమారి, ఖమ్మం టౌన్ అధ్యక్షురాలు బొడ్డు గ్లోరీ తదితరులు పాల్గొన్నారు

## మేకల తండాలో అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి ముత్యాలమ్మ బొడ్రాయి ప్రతిష్ట






**-విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాజీ ఎమ్మెల్యే కందాళ**

**-ఆలయ కమిటీ చైర్మన్ గూగులోత్ బోడ గణేష్, వైస్ చైర్మన్ బోడ శంకర్ ఆధ్వర్యంలో... విగ్రహాల ప్రతిష్ట**

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

మండల పరిధిలోని మేకల తండాలో గత మూడు రోజులుగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది గ్రామంలో ఆంజనేయస్వామి ముత్యాలమ్మ బొడ్రాయి ప్రతిష్ట నిర్వహణను మేకల తండా గ్రామానికి చెందిన ఆలయ చైర్మన్ గుగులోత్ గణేష్, వైస్ చైర్మన్ బోడ శంకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమం విజయవంతంగా సాగింది. మొదట ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మూడు నరేంద్రబాబు తారాబాయి దంపతులు ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. దీంతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. దీనితోడు ఆలయ కమిటీ సభ్యులు కంకణ బద్ధులై ఆలయ నిర్మాణాన్ని శరవేగంగా నిర్మించడానికి గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించారు. మేకల తండా సమీపంలో గ్రానైట్ నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సుమారు 5 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారని కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు గ్రామంలో వేద పండితులు విగ్రహాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించిన అనంతరం ఆదివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి దాతలుగా ఆలయ చైర్మన్ గుగులోత్ గణేష్ గుగులోతు బాలాజీ భద్రమ్మ దంపతులు బొడ్రాయిని తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ తల్లిని బోడ శంకర్ వినోద దంపతులు ఏర్పాటు చేశారు ఆంజనేయస్వామి విగ్రహా న్ని పాలిత్య పాణిత్య శ్రీకాంత్ ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభం హైదరాబాద్ నగరానికి చెందిన కార్పొరేటర్ కుతడి రవీందర్ రేణుక దంపతులు ఏర్పాటు చేయగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ చైర్మన్ గూగులోత్ గణేష్, వైస్ చైర్మన్ బోడ శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

ఇల్లందు మండలం మాణిక్యారం గ్రామ సర్పంచ్ పూనెం స్వర్ణలత -- సంతోష్ దంపతుల ఆహ్వానం మేరకు గౌరవ ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య, వారి సతీమణితో కలిసి వివాహ వేడుకకు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించి నవ దంపతులను కుటుంబ సమేతంగా ఆశీర్వదించారు. అలాగే అదే గ్రామానికి చెందిన గడదాసు వెంకటమ్మ ఆహ్వానం మేరకు ఆమె కుమార్తె నవిత రాజా ల వివాహ వేడుకకు హాజరై నవ దంపతులకు ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్, గౌరవ సర్పంచ్‌ల మండల అధ్యక్షురాలు పాయం స్వాతి, నాయకులు పూనెం సురేందర్, కాకటి భార్గవ్, సర్పంచులు మెచ్చా సాయమ్మ, తాటి యశోద, తాటి భిక్షం, అరెం కిరణ్, ఎట్టి హరికృష్ణ, మూతి కృష్ణ, దండుగుల శివ, చెన్నూరి శ్రీనివాస్, జనగం కొటేశ్వరరావు, చెన్నూరి కృష్ణ, ఉపేందర్, మాజీ సర్పంచ్ మోకాళ్ల కృష్ణ, స్థానిక ఉప సర్పంచ్ బొర్ర రమేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు





ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

ఏదులాపురం మున్సిపాలిటీ రెండవ వార్డ్ కరుణగిరి అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డ్ కౌన్సిలర్ ఏనుగు స్వరూప అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాట్లాడుతూ రెండవ వార్డులో అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం ఈ కార్యక్రమం నిర్వాహలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారులు దాసరి శ్రీను, ఖమ్మం పాత్రికేయులు పాగ యోనా, కరాటే వేణు, నాయకులు ఏనుగు మహేష్, ఒ.ని. యాకూబ్, అంబేద్కర్ జయంతి కమిటీ సభ్యులు పాలకుర్తి రామారావు, కందుల బాబు, గందూరి రాజకుమారి, నందిగామ కిరణ్, సాధనాల ఈశ్వర్, నందిగామ రవి, నీలం శ్యామ్, దండ రోహిన్, కందుల అప్పారావు, మహమ్మద్ సేట్, అరవికట్ల మురళి, జోగు నరేష్, దోస పాటి లింగయ్య అంబేద్కర్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# నేడు కాళోజీ కళాక్షేత్రంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభం

హనుమకొండ,ఏప్రిల్,12 (ప్రతిజ్ఞ )

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ మరియు వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, డాక్టర్ సత్య శారద, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిధులు గా పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను డిసిపి సెంట్రల్ జోన్ ధార కవిత, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు నరసింహారావు, సత్యనారాయణ తదితర అధికారులు ఆదివారం ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని వివిధ వర్గాల ప్రజలతో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి, ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు మరియు ఇతర వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



# కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

హైదరాబాద్, ఏప్రిల్, 12 ( ప్రతిజ్ఞ )

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పరిధిలోని మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు గాను నీటిపారుదల రంగ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్ గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమయి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షలు నిర్వహిస్తుందన్నారు. అవసరమైతే స్వయంగా తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. అంతేగాకుండా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారి నియమించ నున్నట్లు ఆయన తెలిపారు.

పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు గాను సంబంధిత అధికారులతో ఆదివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్,జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్, టన్నెల్ నిపుణులు పరిక్షిత్ మెహ్రా,ఇ. ఎన్.సి లు రమేష్ బాబు,శ్రీనివాస్ లతో పాటు సి.డబ్ల్యూ. పి.ఆర్.ఎస్ ఆదనపు డైరెక్టర్ సెల్వా బాలన్ తదితరులు

ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA), విజిలెన్స్ కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ మూడు నిర్మాణాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయన్నారు. KLIS మరమ్మతుల పూర్తి ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను కీలకంగా పరిగణించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని, అదే సమయంలో మేడిగడ్డను కొంత భాగన్నీ పూర్తి చేయగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. AFRY ఇండియా, IIT ముంబైలకు కొత్త డిజైన్ల బాధ్యతను ప్రభుత్వం ఇప్పటికే డిజైన్ కన్సల్టెంట్గా AFRY ఇండియాను ఎంపిక చేసి, IIT ముంబైతో సంయుక్తంగా పని చేయాలని నిర్ణయించిందన్నారు. డిజైన్ బృందం రాత్రింబగళ్లు పనిచేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. డిజైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, డిజైన్ సిద్ధమైన వెంటనే సెంట్రల్ వాటర్ కమిషన్ (CWC)కు ఆమోదం కోసం పంపాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. సెక్రటరీ పరిక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపులో ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కన్సల్టెంట్లకు ఆయన సూచించారు. డిజైన్ ప్రక్రియకు సంబంధించిన భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. అవసరమైన అన్ని పరీక్షలు, డేటా అత్యవసర ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. CWPRSకు అత్యధిక ప్రాధాన్యం పుణెలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ (CWPRS),ఈ పరీక్షలు, అధ్యయనాల బాధ్యత వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ,కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యున్నత ప్రాధాన్యంగా పరిగణించాలన్నారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కేంద్ర జల కమిషన్తో సమన్వయం చేసి అవసరమైన అనుమతులు పొందాలని ఆయన సూచించారు. CWPRS సిబ్బంది 45 రోజుల పరీక్షల కాలంలో నిరంతరం ప్రాజెక్ట్ స్థలాల్లో ఉండాలని ఆదేశించారు. ఏజెన్సీలకు శిబిరాల పునఃప్రారంభం ఆదేశం ఎల్ ఆ టీ సహా అమలు సంస్థలు తమ క్యాంపులు, మెస్ సదుపాయాలు, లాజిస్టిక్స్ను తక్షణమే పునరుద్ధరించాలని ఆయన చెప్పారు. ఇంజినీర్లు, టెక్నీషియన్లు, రిగ్ ఆపరేటర్లకు వసతి, ఆహార సమస్యలు రాకుండా చూడాలని ఆయన సూచించారు. ఇసుక తొలగింపు, GPR (భూభౌతిక) పరీక్షలు, సైట్ సిద్ధం పనులు అన్ని ఏజెన్సీల పూర్తి సహకారంతో నిర్వహించబడతాయన్నారు. డిజైనర్లు, జభొూా, శాఖ ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు కలిసి అన్ని పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించాలని, ప్రతి అంశాన్ని సక్రమంగా నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



# పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన

హైదరాబాద్, ఏప్రిల్,12 (ప్రతిజ్ఞ)

సమాజ సేవా స్ఫూర్తి, పర్యావరణ పట్ల విద్యార్థులు తమ బాధ్యతను చాటి చెప్పారు. గ్లెండేల్ అకాడమీ ఇంటరాక్ట్ క్లబ్ విద్యార్థులు, లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ రోటరీ క్లబ్ మార్గదర్శకత్వంలో నగరంలోని పీరం చెరువు పరిసరాల శుభ్రత కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చెరుకు 150 మీటర్ల పరిధిలో విద్యార్థులు బృందాలుగా విడిపోయి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ రాజు, కాగితం, చుట్టి, ఇతర రీసైకిల్ చేసే వర్గాలను వేరు చేసి శుభ్రపరిచారు. విద్యార్థులు శ్రమ ఫలితంగా సుమారు 120 కిలోల వ్యర్థ్యాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో పెరుగుతున్న పర్యావరణ అవగాహనకు ఈ కార్యక్రమం ప్రతీక నిలుస్తున్నదని వారు పేర్కొన్నారు.




## మళ్లీ టీఆర్ఎస్గా..! కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

మంచిర్యాల: బీఆర్ఎస్ను మళ్లీ టీఆర్ఎస్గా మార్పు గురించి పరిశీలిస్తామని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మీడియాతో ఆయన చిట్చాట్ నిర్వహించారు. తమకు పొత్తులతో కలిసిరాదని, అటువంటివి కుదరవని వ్యాఖ్యానించారు. గతంలో తాము కూడా కొన్ని తప్పులు చేశామని, లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. అన్ని పథకాల్లో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఈసారి తామే అధికారంలోకి వస్తామని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

## పువ్వాడ నగర్ లో అఖిఖా వేడుక

-చిన్నారులను ఆశీర్వదించిన సీఐ. ఉస్మాన్ షరీఫ్



ఖమ్మం బ్యూరో ఏప్రిల్ 12 (ప్రతిజ్ఞ పత్రిక)

ఖమ్మం జిల్లా: రఘునాథపాలెం మండల కేంద్రంలోని పువ్వాడ నగర్ గ్రామానికి చెందిన షేక్ మైబూబ్ అలీ మనుమలు అఖిఖా వేడుకకు రఘునాథపాలెం మండల సీఐ ఉస్మాన్ షరీఫ్ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు, ఈకార్యక్రమంలో ఎస్ఐ, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పువ్వాడ నగర్ గ్రామ ఇంచార్జ్ అశ్రీఫ్, సర్పంచ్ షేక్ సిద్దిక్, ఉపసర్పంచ్ రాణి, వార్డ్ సభ్యులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దివంగత లక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన బీఆర్ఎస్ నేతలు



ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

ఇల్లందు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రాచర్ల వెంకటేశ్వర్లు అర్ధాంగి దివంగత శ్రీమతి లక్ష్మి దశదిన ఖర్మ కార్యక్రమం ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు దిండిగాల రాజేందర్, సుదర్శనం రంగనాథ్, సీలివెరీ సత్యనారాయణ, జె.కె శ్రీనివాస్, పింగళి నరేష్, పగడాల చందు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు రాచర్ల కుటుంబ సభ్యులను పరామర్శించి, దివంగత లక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

## ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు కోసం మీ సహాయం కోరుతున్నాం




ప్రతిజ్ఞ ఏప్రిల్ 12

ఆరికాయలపాడు గ్రామానికి చెందిన ఎలుగోటి నరేందర్ మట్టినే నమ్ముకుని చెమటను చిందిస్తూకుటుంబాన్ని నిలబెట్టిన ఓ నిజాయితీ గల రైతు...కానీ విధి ఎంత నిర్దయగా ఉందో... ఒక్క క్షణంలోనే ఆయనను మనందరి మధ్య నుంచి దూరం చేసింది... ఆ ఇంట్లో ఇప్పుడు మాటలు లేవు... నిశ్శబ్దమే మాట్లాడుతోంది...తండ్రి కోసం ఎదురు చూసే అమాయక కళ్ళు... ఆధారం కోల్పోయిన భార్య గుండె నిండా బాధ... ఏం జరుగుతుందో కూడా అర్థం కాని చిన్న పిల్లల అమాయకత్వం... వారి నవ్వులు మసకబారిపోయాయి వారి భవిష్యత్తు చీకట్లో మగ్గుతోంది చదువుజీవితం అన్నీ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిపోయాయి ఒక్కసారి ఆలోచించండి... మనమైతే ఎలా ఉండేవాళ్లం ఆ స్థితిలో మన చిన్న సహాయం వారికి జీవనాధారం అవుతుంది వారి జీవితాన్ని మళ్లీ నిలబెట్టే ఆశగా మారుతుంది... మన మనసు కదిలితే ఒక కుటుంబం నిలుస్తుంద మన చేయి అందిస్తే... ఇద్దరు పిల్లల భవిష్యత్తు వెలుగులోకి వస్తుంది... దయచేసి స్పందించండి... సహాయం చేయండి సంప్రదించండి: 9885588040 మన సహాయం... వారి కన్నీళ్లను తుడిచే వెలుగుగా మారాలి